సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

7

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా విశ్వేశ్వరరాజు

- పీఏసీ సభ్యురాలు, ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి
- నియమించిన అధిష్టానం

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ పీఏసీ సభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ విభాగం అధ్యక్షురాలిగా మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును నియమించినట్టు తెలిపింది.

ఐదుగురు తహసీల్దార్లకు బదిలీ



మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో ఐదుగురు తహసీల్దార్లకు బదిలీ జరిగింది. ఈ మేరకు కలెక్టర్, ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పద్మనాభం తహసీల్దార్ ఎం.ఆనందకుమార్‌ను పెందుర్తి తహసీల్దార్‌గాను, పెందుర్తి తహసీల్దార్ కె.వేణుగోపాల్‌ను వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దార్(ఎల్‌ఏ)గాను బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కె.ఆనందరావును పద్మనాభం తహసీల్దార్‌గాను, సబ్బవరం తహసీల్దార్ బి.రవికుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు, అల్లూరి జిల్లా కలెక్టరేట్ పర్యవేక్షకులు బి.చిన్నికృష్ణను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

వైద్య విద్యార్థి కోసం కొనసాగుతున్న గాలింపు

- ఐదో రోజు లభ్యం కాని ఆచూకీ



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి : మండలంలోని జలతరంగిణి జలపాతంలో కొట్టుకుపోయి గల్లంతైన ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల విద్యార్థి సీహెచ్ హరదీప్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. గత ఐదు రోజులుగా అగ్నిమాపక, అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు డ్రోన్, జాగిలాలతో గాలింపు చేపట్టాయి. గురువారం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ పర్యవేక్షించారు. గాలింపు బృందాలు, సిబ్బందికి సూచనలు చేశారు. ఇప్పటికీ హరదీప్ ఆచూకీ లభ్యం కాకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు.

పెసా చట్టం అమలుకు కృషి

- చింతపల్లి ఎంపీపీ అనూషదేవి



ఢిల్లీలో పెసా కాన్ఫరెన్స్‌కు హాజరైన చింతపల్లి ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టం అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీపీ కోరుపు అనూషదేవి అన్నారు. ఢిల్లీ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెసా కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆమె ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సులో పెస చట్టం గురించి ఎంతో మంది నిపుణులు సవివరంగా వివరించారన్నారు. ఇక్కడ తెలుసుకున్న ప్రతీ అంశాన్ని గ్రామస్థాయిలో అమలుకు కృషి చేస్తామన్నారు. ఈ చట్టంలో ఉన్న నిబంధనలు గ్రామ సుపరిపాలనకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు చౌడుపల్లి సర్పంచ్ లలిత పాల్గొన్నారు.



పద్మాపురం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కాటేజీలు, పగోడాలు



వంపులు తిరిగిన మత్స్యగెడ్డ ప్రవాహం



లంబసింగి ప్రాంతంలో స్ట్రాబెర్రీ సాగు



లంబసింగిలో పర్యాటకుల మదిని దోచే మంచు అందాలు

అడవిలో అందాలు

ప్రకృతి ఒడిలో విరిసిన అందాల హరివిల్లు.. మన్యం. పచ్చని పరిసరాలు, ఎత్తయిన కొండలు, వంపులు తిరిగి ప్రవహించే జలపాతాలు.. ఈ ప్రదేశాలను సందర్శించిన వాళ్లంతా భూతల స్వర్గంగా అభివర్ణిస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న పర్యాటక రంగ అభివృద్ధి గత ఐదేళ్లలో పరుగులు తీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సందర్శనీయ ప్రాంతాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దింది. పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం పాలన చేపట్టి వంద రోజులు గడుస్తున్నా పర్యాటక రంగంపై దృష్టి సారించిన సందర్భాలు లేవు.



దుడుమ జలపాతం వద్ద భూతల స్వర్గాన్ని తలపించేలా ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు

- ప్రకృతి ఒడిలో భూతల స్వర్గం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పర్యాటక రంగం అభివృద్ధి
- ప్రత్యేక నిధులతో ఆధునికీకరణ
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం
- మెరుగుపడిన ఉపాధి మార్గాలు
- కొత్త ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం

ముంచంగిపుట్టు/చింతపల్లి/అరకు టౌన్/డుంబ్రిగుడ: పర్యాటకులను రా..రమ్మని ఆహ్వానించే మన్యం అందాలను తిలకించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. తనివితీరా ఆస్వాదించి.. మరపురాని అనుభూతితో వెళ్తున్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగానే పర్యాటక ప్రాంతాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

అరకు పద్మాపురం గార్డెన్: ఇక్కడ గత ప్రభుత్వం అత్యాధునికంగా పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దింది. రూ.48 లక్షలతో కాటేజీలు నిర్మించింది. మరో రూ.16 లక్షలతో గార్డెనింగ్, పగోడాలు, క్యాంటీన్ ఏర్పాటుచేసింది.

అరకు గిరిజన మ్యూజియం: గిరిజనుల సంప్రదాయానికి అద్దం పట్టేలా గిరిజన మ్యూజియం కూడా గత ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందింది. ఇక్కడ రూ.3.60 కోట్లతో సాహస క్రీడలు, గిరిజనుల జీవనశైలి నమూనాలు, ఆడిటోరియం నిర్మించింది. ఇదే ప్రాంతంలో మరో రూ.1.40 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి నిరుద్యోగ గిరి యువతకు ఉపాధి వనరులు అందుబాటులోకి తెచ్చింది.


చాపరాయి జలవిహారి: చాపరాయి జలపాతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను పాడేరు ఐటీడీఏ రూ.70 లక్షలు వెచ్చించింది. ఈనిధులతో కాంపౌండ్ వాల్, పాత్‌వే, ప్రవేశద్వారం, మరుగుదొడ్లు నిర్మించింది.

అరకు పినారి: అంజోడ సిల్క్‌ఫారంను అటవీశాఖ అరకు పినారిగా ఆధునికీకరించింది. ఇక్కడ హట్స్ ఏర్పాటుచేసింది. పర్యాటక సీజన్‌లో సినిమాలు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణతో సందడిగా ఉంటుంది.


బోదకొండమ్మతల్లి వ్యూపాయింట్: చింతపల్లి మండల పరిధిలోని బోదకొండమ్మ తల్లి వ్యూపాయింట్‌ను గత అరకు ఎంపీ మాధవి తన నిధులతో అభివృద్ధి చేశారు. సుమారు రూ.40 లక్షలతో వ్యూపాయింట్‌ను ఏర్పాటుచేశారు.

చెరువులవేనం: లంబసింగిలో పాలసంద్రాన్ని తలపించే చెరువులవేనంలో పాడేరు ఐటీడీఏ రూ.26.50 లక్షలతో వ్యూపాయింట్‌ను నిర్మించింది.

స్వాతంత్ర్య సమరయోధుల గిరిజన మ్యూజియం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.35 కోట్లతో మ్యూజియం నిర్మాణం జరుగుతోంది. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిపోయేలా గత ప్రభుత్వం సంకల్పించి చేపట్టింది.



అంజోడా సిల్క్‌ఫారంలో అరకు పినారీ



చెరువులవేనంలో కనువిందు చేస్తున్న మంచు అందాలు

సినిమా షూటింగ్‌లకు నెలవు



మత్స్యగెడ్డ ఒడ్డున సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినిమా యూనిట్

ప్రకృతి అందాలను తిలకించేందుకు ముంచంగిపుట్టు మండలంలోని డుడుమ జలాపాతానికి భారీగా పర్యాటకులు తరలి వస్తుంటారు. ఇక్కడ వంపులు తిరుగుతూ ప్రవహించే మత్స్యగెడ్డ, డుడుమ జలపాతాలు ప్రత్యేక ఆకర్షణ. సుమారు 2800 అడుగుల ఎత్తునుంచి డుడుమ జలపాతం జాలువారుతుండటంతో నీటి తుంపర్లు ఆవిరి మాదిరిగా ఈ ప్రాంతాన్ని కమ్మేస్తూ భూతల స్వర్గాన్ని తలపిస్తుంటాయి. జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాలు, మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ ఇక్కడి సమీపంలోనే ఉన్నాయి. మత్స్యగెడ్డ పరిసర ప్రాంతాల్లో ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, హన్‌మాన్ తదితర చిత్రాల్లో సన్నివేశాలు చిత్రీకరించారు.

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

- కలెక్టరేట్‌లో వేడుకలకు ఏర్పాట్లు
- కలెక్టర్ దినేష్‌కుమార్


పాడేరు : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా తలార్‌సింగి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు గిరిజన జానపద నృత్యాలు, సంగీత వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి అతిథుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పర్యాటకంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు,యువ టూరిజం కోఆర్డినేటర్లకు ప్రసాంశ పత్రాలు అందజేస్తామన్నారు. అరకు-లంబసింగి స్వదేశీ దర్శన్-2.0లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కొత్త ప్రాజెక్టుల ఊసేదీ?

సాక్షి, విశాఖపట్నం: కొత్త ప్రాజెక్టులతో టూరిజం రంగంలో తనదైన ముద్రను వేసుకోవాలనే సంకల్పంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవకాశాలు అన్వేషించింది. దీనిలో భాగంగానే ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులకు ఎంవోయూలు జరిగాయి. అల్లూరి జిల్లాలో పర్యాటకుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపించాయి. మారేడుమిల్లిలో రూ.వెయ్యి కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ-అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో-ఐఎస్ఎల్‌ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ క్యుజన్ రెస్టారెంట్లు కూడా వచ్చేందుకు అవకాశం ఉంది.

ఆ జోష్ ఎక్కడ..?

ప్రాజెక్టులు ప్రారంభమయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోవడం.. వచ్చిన కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై కనీసం దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. జీఐఎస్‌లో జరిగిన టూరిజం ఒప్పందాలపై 100 రోజులు గడిచినా ఎలాంటి చలనం లేదు. ఇటీవల జిల్లా అధికారులు ఒప్పందాలకు సంబంధించిన సమగ్ర నివేదికని ప్రభుత్వానికి పంపించారు. దీనిపై స్పందించిన టూరిజం ఉన్నతాధికారులు.. వడపోత పేరుతో కాలక్షేపం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఒప్పందానికి వచ్చిన సంస్థలు నిజమైనవా కావా అనేది పూర్తిగా సమీక్షించిన తర్వాతే అవకాశం కల్పించారు. కానీ.. ఇవి గ్రౌండింగ్ అయితే.. వైఎస్సార్‌సీపీకి పేరొస్తుందనే ఉద్దేశంతో.. మీనమేషాలు లెక్కిస్తోంది.



కొత్త ప్రాజెక్టులపై దృష్టి



ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటకానికి అపారమైన అవకాశాలున్నాయి. టూరిజం శాఖకు సంబంధించిన ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. దేశ విదేశీ సందర్శకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి. ప్రకృతి రమణీయతను సందర్శించే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. వారి అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– శ్రీనివాస్‌పాణి, టూరిజం రీజనల్ డైరెక్టర్

నేటి మీకోసం రద్దు

కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : స్థానిక ఐటీడీఏలో శుక్రవారం జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అర్జీదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. వినతులు అందజేసేందుకు ఏఒక్కరు ఐటీడీఏకు రావొద్దని ఆయన సూచించారు.

ఆస్పత్రి వైద్యం వద్దే వద్దు

- అధికారులతో గొడవకు దిగిన అనారోగ్య విద్యార్థి తల్లిదండ్రులు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో ఎట్టకేలకు తరలింపు



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి విద్యార్థి సురేష్‌ను తీసుకువెళ్లిన తల్లిదండ్రులు, ఏటీడబ్ల్యూవో

కొయ్యూరు: అనారోగ్యానికి గురైన గిరిజన విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్‌ఎం ప్రభుదాస్ కలిసి తల్లిదండ్రులకు నచ్చచెప్పినా ఆస్పత్రికి బదులు నాటు వైద్యం చేయిస్తామని మొండికేశారు. చివరకు ఎలాగైతేనేం ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోన్న కొర్రా సురేష్ వినాయక చవితికి సొంతూరు చింతపల్లి మండలంలో కుడిసింగి వెళ్లాడు. అక్కడ అనారోగ్యానికి గురయ్యాడు. సురేష్ పాఠశాలకు రాకపోవడంతో బుధవారం సాయంత్రం వార్డెన్ తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. ఆరోగ్యం సరిగ్గా లేనందున నాటువైద్యం చేయించి తగ్గిన తరువాత పాఠశాలకు పంపిస్తామని వారు బదులిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్‌ఎం కుడిసింగి వెళ్లారు. ఆస్పత్రిల్లో చేర్పిద్దామని వారు చెప్పినా తల్లిదండ్రులు గొడవచేశారు. ఎట్టకేలకు వారు నచ్చచెప్పడంతో తాజంగి ఆస్పత్రిలో చేర్పించారు. అయితే మెరుగైన వైద్యం కోసం సురేష్‌ను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడికి వచ్చేది లేదని తల్లిదండ్రులు అధికారులతో గొడవకు దిగారు. నాటు వైద్యం చేయిస్తామన్నారు. వారికి నచ్చజెప్పడంతో తాజంగి నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి గురువారం తెల్లవారుజామున తీసుకువచ్చారు. ఇక్కడ కూడా తల్లిదండ్రులు ఏటీడబ్ల్యూవోతో గొడవకు దిగారు.పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. దీంతో విద్యార్థిని తీసుకుపోతారన్న అనుమానంతో పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. పీవో చొరవతో విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పించగలిగామని ఏటీడబ్ల్యూవో తెలిపారు.

2న ఏకలవ్య పాఠశాల భవనాలు ప్రారంభం

- హుకుంపేట, చింతపల్లిలో శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో చేయనున్న పీఎం
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి

పాడేరు : పెదబయలు, అరకువ్యాలీ మండలాల్లో రూ.40 కోట్లతో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వచ్చేనెల 2న ప్రధాన మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. వీటిని ఆయన జార్ఖండ్ నుంచి ప్రారంభిస్తారన్నారు. హుకుంపేట, చింతపల్లి మండలాల్లో ఏకలవ్య పాఠశాలలకు ఆయన భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం అరకువ్యాలీ మండలం పకనకుడిలో రెండో విడత నిర్వహించే జన్‌మన్‌లో ఆయన ఆదివాసీ మహిళలతో వర్చువల్ విధానంలో సంభాషిస్తారన్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు 150 పనిదినాలు



గలగండలో ఉపాధి పనులకు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శివయ్య

డ్వామా పీడీ శివయ్య

పెదబయలు: జిల్లాలో ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలు కల్పిస్తామని డ్వామా పీడీ ఎం. శివయ్య తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు పనులు చేపట్టాలని సూచించారు. వర్షం నీరు వృధాగా పోకుండా భూమిలో ఇంకేలా ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. సిల్వర్‌వోక్, జీడి మామిడి తదితర పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. వీటి నీడలో కాఫీ, పైనాపిల్, మిరయంను అంతర పంటలుగా వేసుకుంటే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంతకుముందు గలగండ, సీతగుంట పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులను, మస్తర్లను పరిశీలించారు. గిరి రైతులతో మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రయోజనాలను వారి నుంచి తెలుసుకున్నారు. డీఆర్పీ షణ్ముఖ, ఏపీవో పెదప్పలనాయుడు, ఈసీ సింహాచలం, టీఏ కష్ణకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు సన్యాసమ్మ, సదానందం పాల్గొన్నారు.

నాణ్యమైన మెనూ అమలుచేయాల్సిందే

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



హాజరైన ఏటీడబ్ల్యూవో, హెచ్‌డబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ అమలు చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, వసతి గృహాల సంక్షేమ అధికారులు, హెచ్‌ఎంలతో మెనూ, విద్య, వైద్యం అమలుతీరుపై శుక్రవారం సమీక్షించారు. ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసర సరుకుల సరఫరాకు టెండర్ ఖరారు చేశామని చెప్పారు. వీటలో నాణ్యత లేకపోతే వెంటనే తిరస్కరించాలని సూచించారు. పామాయిల్‌కు బదులు సన్‌ఫ్లవర్ నూనె సరఫరా చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పోషక విలువలున్న ఆహారం అందిస్తే అనారోగ్య సమస్యలు రావని సూచించారు. ప్రధానోపాధ్యాయులు డిప్యూటీ వార్డెన్లుగా పనిచేస్తే ఏ మాత్రం ఉపేక్షించకుండా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలుంటే ఆలస్యం చేయకుండా వెంటనే ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించాలని సూచించారు. వసతి గృహాల్లో కచ్చితంగా సిక్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్న విద్యార్థులను కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని ఆదేశించారు. కొన్ని పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు నేటికి కూడా సరిగ్గా చదవడం లేదంటూ ఆయన హెచ్‌ఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల పాఠశాలల్లో వారి తల్లిదండ్రులు వస్తేనే వారితో బయటకు పంపించాలన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో విద్యార్థులకు వైద్యసేవలు, అంబులెన్స్‌ల ఏర్పాటుకు ఐదుగురితో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఏ టైంలో ఫోన్ చేసినా సిబ్బంది స్వీకరిస్తారని చెప్పారు. కాల్‌సెంటర్ 08935 517370, 6303921374 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజనీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏటీడబ్ల్యూవో సుజాత

కూనవరం: మండలంలోని నర్సింగపేట, రేపాక ఆశ్రమ పాఠశాలలను ఏటీడబ్ల్యూవో సుజాత గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్వాహకులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

బోధనపై ప్రత్యేక శ్రద్ధ

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి : ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. వారికి అర్థమయ్యే వరకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనుమతి లేకుండా ఇతరులను పాఠశాల లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి మంచిస్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అవునా.. మరి ప్రమాదాలెందుకు జరుగుతున్నాయి?

- ఫార్మా కంపెనీ ప్రతినిధుల మాటలకు హైలెవల్ కమిటీ చురకలు
- జిల్లా అధికారులు అద్భుతమన్న కంపెనీ ప్రతినిధులు
- అబద్ధాలెలా చెప్పగలుగుతున్నారంటూ నిలదీసిన ఛైర్‌పర్సన్



మాట్లాడుతున్న హైలెవల్ కమిటీ ఛైర్‌పర్సన్ వసుధా మిశ్రా, కలెక్టర్ విజయ కృష్ణన్



హాజరైన ప్రభుత్వాధికారులు, ఫార్మా సంస్థల యజమానులు

ఫార్మా కంపెనీల ప్రతినిధులు : మేడం.. మా జిల్లా అధికారులు అద్భుతం. ఫ్యాక్టరీలో ఏ చిన్న పొరపాటు ఉన్నా ఒప్పుకోరు. ప్రతి నిబంధనని పక్కాగా పాటించాలని హెచ్చరిస్తూనే ఉంటారు. ఫ్యాక్టరీస్ విభాగం, ఏపీఐఐసీ, బాయిలర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.. ఇలా ప్రతి విభాగాల అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారండీ.

వసుధా మిశ్రా : అవునా.. నిజంగానా.? అంత అద్భుతంగా ఉంటే.. మీరు అంత పక్కాగా నిబంధనలు పాటిస్తుంటే ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో.? మీరు చెప్పింది మీకైనా నమ్మశక్యంగా ఉందా.? ఇలాంటి మాటలు ఇంక ఆపండి. ఇకపై ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రతి నిబంధన తప్పకుండా పాటించండి.

ఇదీ.. ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీకి, ఫార్మా కంపెనీల ప్రతినిధుల మధ్య జరిగిన సంభాషణ.

సాక్షి, విశాఖపట్నం : ఫార్మా ప్రమాదాల్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీ బృందం జిల్లాలో ఉన్న పలు సెజ్‌లలో పర్యటించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలో పర్యటించిన బృందం అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ఫార్మా కంపెనీల్ని పరిశీలించింది. ఈ సందర్భంగా లారస్ ల్యాబ్స్ యూనిట్-2లోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఎసైన్షియా, సినర్జీ కంపెనీల్లో జరిగిన ప్రమాదాల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఫార్మా సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫార్మా ప్రతినిధులు ఆయా ప్రభుత్వ విభాగాల అధికారుల గురించి ప్రస్తావిస్తూ.. వారంతా అద్భుతంగా పని చేస్తున్నారంటూ కితాబిచ్చారు. దీనిపై కమిటీ ఛైర్‌పర్సన్ వసుధా మిశ్రా స్పందిస్తూ.. అంత అద్భుతంగా పనిచేస్తే.. ప్రమాదాలు వెంటవెంటనే ఎందుకు జరిగాయని ప్రశ్నించారు. దీంతో ఫార్మా కంపెనీల ప్రతినిధులు మౌనం దాల్చారు. మిశ్రా మాట్లాడుతూ.. కమిటీ వచ్చింది భవిష్యత్తులో మరో ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేయడానికి.. ప్రమాదానికి గల కారణాలు, చోటుచేసుకున్న వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నించవద్దని హితవు పలికారు.

క్షేత్ర స్థాయిలో అసలు ఏం జరుగుతోందో.. ప్రతి ఒక్కరూ నిజాయితీగా చెబితేనే.. మరో ప్రమాదం జరగకుండా నివారించి.. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించగలమన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏ విభాగం.. ఎలా పనిచేస్తుందో తమ విచారణలో తేలుతుందని ఛైర్‌పర్సన్ మిశ్రా స్పష్టం చేశారు. పరిశ్రమల పరిరక్షణకు, కార్మికుల సంక్షేమానికి ఫార్మా యాజమాన్యాలు పూర్తిగా సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో హై లెవల్ కమిటీ కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎవి పటేల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ రాఘవన్ (ఐఐటీ చెన్నై), ఆర్డీవో చిన్నికృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరి ప్రసాద్, ఇండస్ట్రీస్ జీఎం శ్రీధర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండగల వేళ పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): దసరా, దీపావళి వంటి పండగల సందర్భంగా పలు రైళ్లకు తాత్కాలికంగా కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూరు(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2, 11వ తేదీల్లో, కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్(18464)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3, 12వ తేదీల్లో ఒక స్లీపర్ కోచ్
- భువనేశ్వర్-తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 10వ తేదీ వరకు, తిరుపతి-భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 7 నుంచి నవంబరు 11వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్
- భువనేశ్వర్-పుణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 1 నుంచి నవంబరు 5వ తేదీ వరకు, పుణే-భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3 నుంచి నవంబరు 7వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్
- సంబల్‌పూర్-నాందేడ్ (20809) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి 28వ తేదీ వరకు, నాందేడ్-సంబల్‌పూర్ (20810) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 5 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్
- సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2 నుంచి 30వ తేదీ వరకు, ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్
- విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం (08551/08552) పాసింజర్ స్పెషల్‌కు అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్
- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్‌కు అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్
- భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3 నుంచి నవంబరు 14వ తేదీ వరకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 15వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్
- భువనేశ్వర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (12845) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 17వ తేదీ వరకు, ఎస్ఎంవీటీ బెంగళూరు-భువనేశ్వర్(12846) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 7 నుంచి నవంబరు 18వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్
- భువనేశ్వర్-పుదుచ్చేరి (12898) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 1 నుంచి నవంబరు 12వ తేదీ వరకు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12846) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2 నుంచి నవంబరు 13వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్
- భువనేశ్వర్-రామేశ్వరం (20896) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 15వ తేదీ వరకు, రామేశ్వరం-భువనేశ్వర్(20895) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 17వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జత చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ పర్యాటక ప్రాంతాలకు ఉచిత ప్రవేశం

విశాఖ సిటీ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న పర్యాటక పార్కులు, మ్యూజియాల్లో ఉచిత ప్రవేశ ఉంటుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. వైఎస్సార్ సెంట్రల్ పార్క్, కైలాసగిరి, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142, సీ-హారియర్ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్కు వంటి సందర్శన స్థలాల్లో ప్రవేశాలకు ఎటువంటి టికెట్ల వసూలు చేయడం జరగదని వెల్లడించారు.

జూలో 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, జూ అవుట్‌రీచ్, రీల్ మేకింగ్, బటర్‌ఫ్లై రన్నింగ్ వర్క్‌షాప్, సీడ్ బాల్ మేకింగ్, బర్డ్ వాక్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94408 10213ను సంప్రదించాలని సూచించారు.

టెట్‌కు జిల్లాలో 8 కేంద్రాలు

విశాఖ విద్య : టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024కు జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 21 వరకు జరిగే ఈ పరీక్షకు 60,574 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి ఏదైనా సమాచారం కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్ చేసుకోవాలని సూచించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

అరకులోయ రూరల్: మండలంలో గన్నెల పంచాయతీ పరిధిలోని తడక- కాగువలస గ్రామాల మధ్యలో గురువారం సాయంత్రం అరకులోయ వైపు నుంచి లోతేరు వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకంఠనాథరెడ్డి



ఎకో టూరిజం ప్రాజెక్టును ప్రారంభిస్తున్న శ్రీకంఠనాథరెడ్డి

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకంఠనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలో శ్రీకృష్ణాపురంలో రూ.25లక్షలతో చేపట్టిన ఎకో టూరిజం ప్రాజెక్టును డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్‌తో కలిసి ప్రారంభించారు. ఏటా పెరుగుతున్న పర్యాటకుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఆరు ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారులు అప్పారావు, లక్ష్మీపాత్రుడు, శ్రీనివాసరావు వర్మ, శివరంజని వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా ప్రహ్లాద్‌కు వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం

కళాభారతిలో నేడు ప్రదానం



ప్రతిభా ప్రహ్లాద్(ఫైల్)

మద్దిలపాలెం(విశాఖ): ప్రఖ్యాత నాట్య కళాకారిణి ప్రతిభా ప్రహ్లాద్ 'వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం-2024'కు ఎంపికయ్యారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమెకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో 16వ అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సవం పేరిట 'వైశాఖీ నృత్యోత్సవాలు' జరగనున్నాయి. తొలి రోజు సుప్రసిద్ధ భరతనాట్య, కూచిపూడి నాట్యకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రతిభా ప్రహ్లాద్‌ను వైశాఖీ జీవన సాఫల్య పురస్కారంతో గౌరవిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రతిభా ప్రహ్లాద్ భరతనాట్యం, కూచిపూడిలో విశేష నైపుణ్యం కలిగి నాట్యకారిణి. తొలినాళ్లలో బెంగళూరులో తమ ఇంటికి సమీపంలో నాట్యంలో శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత సోమవారం నుంచి శుక్రవారం వరకు బడికి వెళ్లి.. శుక్రవారం సాయంత్రం రైలెక్కి మద్రాసు వెళ్లేవారు. శని, ఆదివారాలు యు.ఎస్.కృష్ణారావు దంపతులు, తర్వాత కళానిధి నారాయణ, వీఎస్ ముత్తుస్వామి పిళ్లై వద్ద నాట్యం నేర్చుకున్నారు. అనంతరం డాక్టర్ వెంపటి చిన సత్యం వద్ద కూచిపూడి నాట్యాన్ని అభ్యసించారు. దేశంలో 3 వేలకు పైగా భరతనాట్య ప్రదర్శనలు, దాదాపు 85 దేశాల్లో భారతీయ నృత్య ప్రదర్శనలు చేసి అరుదైన ఘనతకు సొంతం చేసుకున్నారు. ఫోరం ఫర్ ఆర్ట్ బియాండ్ బోర్డర్స్ పేరుతో ప్రసిద్ధి పొందిన ఫౌండేషన్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ ఆమె. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫెస్టివల్‌ను స్థాపించిన ఘనత ఆమెకే దక్కుతుంది. ప్రతిభా ప్రహ్లాద్ కళారంగానికి చేసిన కృషికి గానూ పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ అవార్డును స్వీకరించారు. తపాలా శాఖ ఆమెపై గౌరవ సూచకంగా రూ.5 విలువ కలిగిన పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది. వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం ఆమెకు లభించడంపై పలు కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

పీవీటీజీల అభ్యున్నతికి పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీవో రమణ

రంపచోడవరం : ఏజెన్సీలోని పీవీటీజీల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టిందని ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా వివిధ రకాలైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు అక్టోబర్ రెండోవ తేది గాంధీ జయంతి పురస్కరించుకొని ఏజెన్సీలోని పీవీటీజీల గ్రామాల అభివృద్ధి చేయడానికి పీఎం జన్‌మన్ పథకం ద్వారా తగు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అలాగే 11 రకాలైన పథకాలు గృహాలకు తాగునీరు, రహదారులు, కరెంటు, విద్య, వైద్య సేవలు, నెట్‌వర్కు సౌకర్యం వంటివి చేపట్టును న్నట్టు పేర్కొన్నారు. అక్టోబర్ 2న ప్రధాన మంత్రి ఢిల్లీ నుంచి వివిధ శాఖల అధికారుల ద్వారా వర్చ్యువల్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఐటీడీఏ కార్యాలయానికి ప్రతి మండలం నుంచి పది మంది చొప్పున పీవీటీజీలను తీసుకురావాలని కోరారు.

సెయిల్‌లో విలీనమే ఉక్కు సమస్యకు పరిష్కారం



మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం

- సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర ఉక్కు మంత్రిని కలిసేందుకు అఖిలపక్షం
- జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం
- ముందు తీర్మానానికి అంగీకరించని టీడీపీ కార్పొరేటర్లు
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్ల పట్టుతో దిగొచ్చిన 'కూటమి'

విశాఖ సిటీ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం విషయంలో ఎట్టకేలకు కూటమి కార్పొరేటర్లు దిగొచ్చారు. స్టీల్‌ప్లాంట్ అంశాన్ని టేబుల్ అజెండాలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీల కార్పొరేటర్లు కోరినప్పటికీ.. కూటమి సభ్యులు అడ్డుతగులుతూ వచ్చారు. దీంతో కౌన్సిల్ సమావేశం మూడు రోజుల పాటు నిర్వహించాల్సి వచ్చింది. మూడో రోజు కూడా టేబుల్ అజెండాలో చివరి అంశంగా స్టీల్‌ప్లాంట్‌ను చేర్చినప్పటికీ.. దానిపై చర్చించేందుకు చివరి క్షణం వరకు తటపటాయించారు. మిగిలిన పార్టీల సభ్యులంతా గట్టిగా పట్టుబట్టడంతో కూటమి కార్పొరేటర్లు దిగొచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలిసేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. వరుసగా మూడు రోజు గురువారం జీవీఎంసీలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన అజెండాతో పాటు అనుబంధ, టేబుల్ అజెండాతో కలిసి మొత్తం 83 అంశాలపై చర్చించారు. వీటిలో 81 అంశాలను ఆమోద ముద్ర వేశారు.

యూజర్ చార్జీలు, ఆస్తి పన్ను తగ్గింపు రగడ

అజెండాను ప్రారంభించాలని మేయర్ చెప్పినప్పటికీ.. సీపీఐ, సీపీఎం ఫ్లోర్‌లీడర్లు యూజర్ చార్జీల రద్దు, ఆస్తి పన్ను తగ్గింపు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసేందుకు టేబుల్ అజెండాలో పెట్టాలని మేయర్‌ను కోరారు. దీనికి మేయర్ అంగీకరించి అధికారులకు ఆదేశించారు. దీనిపై కూటమి పార్టీ కార్పొరేటర్లు అడ్డుతగిలారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ అంశంపై చర్చించడానికి కూడా అంగీకరించలేదు. తీర్మానం చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అలాగే చెత్తపై యూజర్ చార్జీలను ప్రభుత్వం రద్దు చేసిందని, మళ్లీ కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సిన అవసరం లేదని వాదించారు. దీనిపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు స్పందిస్తూ.. రద్దు చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేస్తే చూపించాలని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పలేని కూటమి సభ్యులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను వసూలు చేయడం లేదని చెప్పుకొచ్చారు. దీనిపై వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ సభ్యులు కలిస్తుంచుకొని జీవో ఇవ్వని పక్షంలో భవిష్యత్తులో మళ్లీ వసూలు చేసే అవకాశం ఉంటుందని, అందుకే కౌన్సిల్‌లో తీర్మానం చేసి పంపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆస్తి పన్నును 0.13 శాతం నుంచి 0.1కు తగ్గించాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు కోర్టు పరిధిలో ఉన్నాయని, అజెండాల్లో పెట్టి తీర్మానం చేస్తే కోర్టు ధిక్కరణ అవుతుందని టీడీపీ కార్పొరేటర్లు బుకాయించే ప్రయత్నం చేశారు. అయితే ఆస్తి పన్ను తగ్గించే అధికారం కౌన్సిల్‌కు ఉందని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు రాదని వామపక్ష పార్టీల సభ్యులు చెప్పినప్పటికీ కూటమి కార్పొరేటర్లు అంగీకరించలేదు.

నేటి నుంచి జాబ్ మేళా

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏవీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ కె.నారాయణరావు తెలిపారు. 27 శుక్రవారం నిర్వహించే జాబ్‌మేళాలో పోకారం ఇంజినీర్డ్ స్టోన్ కంపెనీ డిప్లమో ఇంజినీర్ ట్రైనీ, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ పోస్టులను భర్తీ చేయనుంది. డిప్లమో లేదా బి.టెక్ మెకానిక్ అండ్ మెక్ట్రానిక్స్ కోర్సులు చేసిన 19 నుంచి 25 ఏళ్ల లోపు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారికి స్టైఫండ్‌గా రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తారు. రెండేళ్ల పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ఏడాది శిక్షణ అనంతరం డీఈటీకి రూ.17,000లు, జీఈటీకి రూ.20,500 ప్రారంభ జీతంగా చెల్లిస్తారు. ఈపీఎఫ్, ఈఎస్ఐతో పాటు బోనస్ సౌకర్యం ఉంటుంది. వీరు మేకాగుడా, షాద్‌నగర్, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుంది.

- రుషికొండ ఐటీ పార్కులోని ఏసీఎస్ హెల్త్ కేర్ సంస్థలో వాయిస్ ప్రాసిస్(ఏఆర్ కాలర్) ఉద్యోగానికి డిగ్రీ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి నెలకు రూ.13వేల జీతంతో పాటు ప్రయాణ భత్యంగా రూ.3వేలు చెల్లిస్తారు. వయోపరిమితి లేదు. మహిళా ఉద్యోగులకు క్యాబ్ సౌకర్యం ఉంటుంది.
- అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్ అండ్ ఫార్మసీ ట్రైనీ ఉద్యోగానికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి నెలకు రూ.10,000 నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్‌సెంటివ్స్ చెల్లిస్తారు. ఎన్ఏడీ, గాజువాక, గోపాలపట్నం, కంచరపాలెం, అక్కిరెడ్డిపాలెం, లక్కిడాంలో పని చేయాల్సి ఉంటుంది. వివరాలకు 99487 68778లో సంప్రదించవచ్చు. https://forms.gle/yHEFLCHGRn C2sPBm7లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- 28న నిర్వహించే జాబ్ మేళాలో మేధా సెర్వో డ్రైవ్స్ కంపెనీలో టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనీల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ డిప్లమో పూర్తి చేసి 70 శాతం మార్కులు సాధించిన 2023, 2024లో పాస్ అవుట్ అయిన వారు అర్హులు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని ఆర్ అండ్ సెంటర్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో పని చేయాల్సి ఉంటుంది. వీరికి రూ.2.90 లక్షల వార్షిక ప్యాకేజీ చెల్లిస్తారు.

తండ్రి కలలు సజీవం

కుమారుడి అవయవాలతో ముగ్గురికి ప్రాణదానం



అవయవదానం చేసిన సంతోష్ (ఫైల్)



ఆస్పత్రి సీఈవోతో సంతోష్ తండ్రి సత్తిబాబు

చోడవరం: తన కొడుకూ.. అందరిలాగే ఆరోగ్యంగా నూరేళ్లు బతకాలనుకున్నాడు. చిన్నతనంలోనే రెండు కిడ్నీలు పాడై ప్రాణాపాయం వస్తే తన కిడ్నీ ఇచ్చి బతికించాడు. 23 ఏళ్ల వయసులో కుమారుడు హఠాత్తుగా మరణిస్తే.. అంత దుఃఖంలోనూ వేరొకరికి అవయవదానం చేశాడు. ముగ్గురిని బతికించి వారిలో తన బిడ్డను చూసుకోవాలనుకుంటున్నాడు.. ఆ తండ్రి కలలు సజీవం. ఆ తండ్రీ కొడుకుల జన్మ ధన్యం. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన బెల్లపుకొండ సత్తిబాబు తాపీమేస్త్రి పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు. సంతోష్ రెండో కుమారుడు. పదేళ్ల వయస్సు నుంచే సంతోష్‌కు ఆరోగ్యం బాగోలేదు. ఒక దశలో రెండు కిడ్నీలు పాడైపోవడంతో కొడుకును బతికించుకోవడానికి సత్తిబాబు తన కిడ్నీ ఇచ్చాడు. సంతోష్‌కి 23 ఏళ్లు వచ్చాయి. డిగ్రీ వరకు చదివాడు. విశాఖపట్నంలో ఒక ప్రైవేటు షాపులో పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. ఇంతలో రెండ్రోజుల కిందట సంతోష్‌కు ఆకస్మికంగా తలనొప్పి రావడంతో విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. సంతోష్ బ్రెయిన్‌డెడ్‌కు అయినట్టు వైద్యులు నిర్ధారించారు. సంతోష్ గురువారం మృతి చెందాడు. తన కొడుకు మృతి చెందినా ఆయన అవయవాల దానంతోనైనా కొందరిలో తన కొడుకు బతికి ఉంటాడని సత్తిబాబు భావించారు. ఊపిరితిత్తులు, కాలేయం, కళ్లు ముగ్గురికి దానం చేయాలని నిర్ణయించారు. వెంటనే రాష్ట్ర జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ రాంబాబు పర్యవేక్షణలో సంతోష్ అవయవాలను దానం చేసే ప్రక్రియ చేపట్టారు. లంగ్స్‌ను గ్రీన్‌చానల్ ద్వారా హైదరాబాద్ తరలించగా ఊపిరితిత్తులు, కళ్లను సీనియార్టీ ప్రకారం కేటాయించారు. సంతోష్ చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం చేశాడు. తండ్రి స్ఫూర్తితోనే ఇది సాధ్యమైంది.